క్లుప్తంగా

20న వాహనాల బహిరంగ వేలం

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేయబడిన 25 వాహనాల బహిరంగ వేలంపాట ఈ నెల 20న స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించే వేలంలో పాల్గొనే వారు అదే రోజు ఉదయం 9 గంటల నుంచి స్టేషన్ నందు ముందస్తుగా ధరావత్ రుసుము చెల్లించాలని, ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

గైనకాలజిస్ట్ పోస్టులు భర్తీచేయాలి


డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న ఓయూ జేఏసీ నాయకులు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న నాలుగు గైనకాలజిస్ట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఓయూ జేఏసీ నేత సోమగాని నరేందర్ గౌడ్ కోరారు. బుధవారం హుజూర్‌నగర్ వచ్చిన డీఎంహెచ్‌ఓ కోటాచలానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి సంబంధించి పలు విషయాలను డీఎంహెచ్‌ఓకు వివరించారు. ఆయన వెంట ప్రజా కళాకారుడు బాదె నర్సయ్య, న్యాయవాది బాలాజీ నాయక్, శంకరయ్య తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు అండగా లయన్స్‌క్లబ్

నేరేడుచర్ల: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు నేరేడుచర్ల లయన్స్‌క్లబ్ అండగా ఉంటుందని ఆ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి అన్నారు. బుధవారం నేరేడుచర్ల మండలం జానలదిన్నె గ్రామానికి చెందిన ఎస్‌కే.మౌలానా కుటుంబానికి నేరేడుచర్లలోని టిస్లా స్కూల్ కరస్పాండెంట్ దాసరి సతీష్ సహకారంతో నిత్యావసర సరుకులు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చిత్రం విశ్వనాథ్, రాపోలు నవీన్, తక్కెళ్ల నాగార్జున, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

నేరేడుచర్ల: గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్మన్ అలక సరిత అన్నారు. బుధవారం నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో మహాలక్ష్మి పథకం కింద వచ్చిన ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్ రెడ్డి, కౌన్సిలర్లు కొణతం చిన వెంకట్‌రెడ్డి, రణపంగ నాగయ్య, ఎస్‌కె బాష, తాళ్లూరి సాయిరాం, కొదమగుండ్ల సరిత, బాణోతు లలిత, వేమూరి నాగవేణి పాల్గొన్నారు.

రెండోరోజూ 'ప్రజా పాలన'


పెదవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చెత్త ఎత్తుతున్న పంచాయతీ సిబ్బంది

మఠంపల్లి: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన కార్యక్రమం బుధవారం రెండో రోజు కొనసాగింది. పారిశుద్ధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పెదవీడు హైస్కూల్‌లో పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. గుర్రంబోడు తండా పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శులు విజయ, మద్దుల వెంకటేశ్వర్లు, రాజు, గోపిరాజా, పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదం

హుజూర్‌నగర్: వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని ఎంఈఓ సైదానాయక్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని ఎన్నెస్పీ క్యాంపు స్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి క్రీడలు సహకరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నేతలతో నేడు సమావేశాలు

కోదాడ రూరల్, నడిగూడెం, మోతె: గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాల అభ్యంతరాలపై గురువారం కోదాడ, నడిగూడెం, మోతె మండల పరిషత్ కార్యాలయాల్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయా మండలాల ఎంపీడీఓలు రాంచందర్‌రావు, ఎస్‌డీ.ఇమామ్, ఆంజనేయులు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ సమావేశాలకు అన్ని రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు, కార్యదర్శులు ఉదయం 11 గంటల వరకు విధిగా హాజరు కావాలని వారు కోరారు.

ప్రమాదకరంగా రహదారులు


దెబ్బతిన్న నడిగూడెం- చాకిరాల రోడ్డు


నడిగూడెంలో దెబ్బతిన్న రహదారి

- నడిగూడెం మండలంలో వరదలకు దెబ్బతిన్న రోడ్లు
- రాకపోకలకు ఇబ్బందులు
- మరమ్మతులు చేయించాలని ప్రజల వేడుకోలు

నడిగూడెం: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారులు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. ఈ రహదారులపై నిత్యం రాకపోకలు సాగించే వేలాది మంది ప్రజలు, వివిధ రకాల వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వీటితో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా భారీ వర్షాలు కురవడంతో రహదారులు తీవ్ర దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే దెబ్బతిన్న రహదారులను మరమ్మతులు చేయించి వివిధ వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయంటే..

ముఖ్యంగా నడిగూడెం, బృందావనపురం, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, తెల్లబల్లి, శ్రీరంగాపురం, వల్లాపురం గ్రామాల్లోని చెరువు కట్టలు, డొంక దారులు భారీగా ధ్వంసమయ్యాయి. రత్నవరం, వల్లాపురం గ్రామాల వద్ద ఉన్న కల్వర్టులపై నుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. నడిగూడెంలో చౌదరి చెరువు అలుగు పోయడంతో ఎస్సీ, బీసీ కాలనీల మధ్య ఉన్న వాగు వెంట ఉన్న రహదారి కోతకు గురైంది. అలాగే నడిగూడెం చాకిరాలకు వెళ్లే రహదారి వెంట వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లే దారులు కోతకు గురై కృంగిపోయాయి. రాళ్లు తేలి రాకపోకలకు ఆటంకంగా మారాయి. ఇదే రూట్‌లో ప్రధాన రహదారి పలు చోట్ల కోతకు గురైంది.

రహదారి పూర్తిగా దెబ్బతిన్నది



మా గ్రామ సమీపాన ఉన్న సాగర్ ఎడమ కాల్వకు గండి పడింది. దీంతో నీటి ప్రవాహానికి పంట పొలాలకు వెళ్లే దారి పూర్తిగా దెబ్బతిన్నది. రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. అధికారులు స్పందించి దారికి మరమ్మతులు చేపట్టాలి.

– జనార్దన్‌రెడ్డి, కాగితరామచంద్రాపురం

వెంటనే మరమ్మతులు చేయించాలి



మా గ్రామం నుంచి నడిగూడెం మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురై దెబ్బతిన్నది. ఈ రహదారిపై అనేకమంది నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఈ రహదారిని వెంటనే మరమ్మతులు చేయించాలి

– చీమ ప్రవీణ్ కుమార్, చాకిరాల

ఉనికి కోసం మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కోదాడ: కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తన ఉనికి కోసమే ఉత్తమ్ దంపతులపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని కోదాడ కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం కోదాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వరద ముంపు ప్రాంతాల్లో మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి పర్యటించి బాధితులకు భరోసా ఇచ్చారని, పనులన్నీ యుద్ధప్రాతిప్రదికన జరుగుతున్నాయన్నారు. కొంత మందిని రెచ్చగొట్టడం, ఫొటోలకు ఫోజులు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే చేసిన ప్రయత్నాలను వారు వీడియో రికార్డును చూపించారు. ఈ సమావేశంలో నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ముత్తవరపు పాండురంగారావు, వంగవేటి రామారావు, కందుల కోటేశ్వరరావు, బొలిశెట్టి నాగేంద్రబాబు, కర్రి సుబ్బారావు, కొణతం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

మోతె: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కోశాధికారి జి.వెంకటయ్య అన్నారు. బుధవారం మోతె మండలం మామిళ్లగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఆ సంఘం మండల మహా సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏలె సీనయ్య, ప్రధాన కార్యదర్శిగా దామల్ల నరేందర్, ఉపాధ్యక్షులుగా కె.సాయి శ్యాం, చంద్రకళ, కోశాధికారిగా శ్రీనివాస్, కార్యదర్శులుగా ఎం.యాదయ్య, ఎస్.లక్ష్మీ, నారాయణ, చాంప్ల, కృష్ణ, కవిత, ఓట్ కన్వీనర్‌గా వీరన్న, సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా ఆనంద కిశోర్, క్రీడా కన్వీనర్‌గా శ్రీనివాస్, మహిళా కన్వీనర్‌గా ఉషశ్రీ ఎన్నికయ్యారు. ఈ సభలో సంఘం జిల్లా కార్యదర్శులు సీహెచ్.వీరారెడ్డి, పాపిరెడ్డి, మండల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి


హుజూర్‌నగర్ : ప్రతిజ్ఞ చేయిస్తున అధికారులు


నేరేడుచర్లలో..

హుజూర్‌నగర్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు అధిక ప్రాధాన్యమివ్వాలని మున్సిపల్ కమిషనర్ యాకుబ్ పాషా అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం హుజూర్‌నగర్‌లోని ఎన్నెస్పీ క్యాంప్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ నిర్వహించి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ సైదానాయక్ , శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధాయులు, మున్సిపల్ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ మున్సిపాలిటీగా మారుద్దాం

నేరేడుచర్ల: నేరేడుచర్లను స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్మన్ అలక సరిత, కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2 వరకు జరగనున్న స్వచ్ఛత హీ సేవా–2024పై బుధవారం నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, కౌన్సిలర్లు, పారిశుద్ధ్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అమ్మ పేరుతో ప్రతి ఇంటా ఒక మొక్క నాటేలా అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 30వ తేది వరకు చేపట్టే వివిధ కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొణతం చిన వెంకట్ రెడ్డి, రణపంగ నాగయ్య, ఎస్‌కే.బాషా, తాళ్లూరి సాయిరాం, కొదమగుండ్ల సరిత, బాణోతు లలిత, వేమూరి నాగవేణి, అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

మునగాల: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మునగాల మండలం జగన్నాథపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్రా అనిత, ప్రధానోపాధ్యాయుడు వక్కంతుల భరత్‌బాబు, టీచర్లు పాల్గొన్నారు.

సాగునీరు అందించడంలో విఫలం



ఎండిన పొలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ రూరల్: ఎండుతున్న వరిపొలాలకు సాగునీరందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని హుజూర్‌నగర్ మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ మండలం అమరవరంలో ఎండిపోతున్న సాగర్ ఆయకట్టు చివరి భూములను బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. వరి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు పరిహారం అందించాలన్నారు. ఆయన వెంట నాయకులు గుజ్జుల అంజిరెడ్డి, ఉస్తేల లింగారెడ్డి, రాంరెడ్డి నర్సిరెడ్డి, వెంకటాచారి, సైదులు, పలువురు రైతులు ఉన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

వరదలకు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టం అంచనా వేసి వెంటనే రైతులకు పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెం వద్ద ముక్త్యాల బ్రాంచి కెనాలను సీపీఐ నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో గండు వెంకటటేశ్వర్లు, రమేష్, నర్సయ్య, అంజయ్య, రమణ పాల్గొన్నారు.

మత్స్యకారుల సదస్సును జయప్రదం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఈనెల 25న నిర్వహించే మత్స్యకారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని మత్స్యకారుల, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శీలం శ్రీను పిలుపునిచ్చారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాయంలో మత్స్యకార నాయకులతో రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మత్స్యకారులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఉచిత చేప పిల్లలకు బదులుగా నగదును మత్స్య సొసైటీల అకౌంట్లలో జమ చేయాలని కోరారు. 50 ఏళ్లు నిండిన మత్స్యకారులకు పింఛన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు హుస్సేన్, వెంకన్న, పర్వతాలు, తిరపయ్య, యశోద, కృష్ణ, వెంకటి, గురవమ్మ, జానకి రాములు పాల్గొన్నారు.

'జయ' విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో జయ పాఠశాల ప్రిన్సిపాల్ వేణు

కోదాడ: జాతీయ స్థాయిలో నిర్వహించిన ఏఎంటీఐ గణిత ఒలింపియాడ్‌లో కోదాడకు చెందిన జయ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచి రెండవ లెవల్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వేణు తెలిపారు. ప్రతిభ కనబరిచిన పాఠశాలకు చెందిన 29 మంది విద్యార్థులను బుధవారం పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో నిర్వాహకులు అభినందించి మాట్లాడారు.

మా చెరువులో మేమే చేపలు పెంచుకుంటాం

- పెంచికల్‌దిన్నె చెరువు సొసైటీ సభ్యుల ఏకగ్రీవ తీర్మానం


మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు వెంకటయ్య

నేరేడుచర్ల: మా చెరువులో మేమే చేపలు పెంచుకుంటాం.. ఈ చెరువు ఎవరికి లీజుకివ్వమంటూ నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నె చెరువు మత్స్య సహకార సంఘం (మత్స్య సొసైటీ) సభ్యులు బుధవారం తీర్మానించారు. బుధవారం గ్రామంలో జరిగిన సంఘం అత్యవసర సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సొసైటీ అధ్యక్షుడు ఇంజమూరి వెంకటయ్య పేర్కొన్నారు. 2024–25 సంవత్సరానికి మత్స్యకారులందరు సొంత ఖర్చుతో చేప పిల్లలను చెరువులో పోసి పెంచుకోవాలని తీర్మానించుకున్నామని తెలిపారు. గతంలో లీజుకిస్తే కాంట్రాక్టర్ సొసైటీ అభివృద్ధిపై శ్రద్ధ చూపలేదని, మత్స్య శాఖకు చెల్లించాల్సిన లీజు సైతం చెల్లించలేదన్నారు. గతంలో మాదిరిగా మాపై దాడులు జరగకుండా మత్స్యశాఖ, పోలీస్ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సొసైటీ సభ్యులు సిరికొండ నాగయ్య, మట్టయ్య, యాడవల్లి వెంకటనర్సు, చంద్రయ్య, సోమయ్య, రాములు, మధు, రాంబాబు, వెంకటరమణ, వెంకటయ్య, హరీష్, ఏసు, నాగయ్య, లక్ష్మయ్య, బాలరాజు, అరుణ్, నాగయ్య, రామారావు, రవి, వెంకటేశ్వర్లు, చిన రవి, రాములు, దేవరయ్య తదితరులున్నారు.

వేట కుక్కకు శస్త్రచికిత్స


చికిత్స చేస్తున్న డాక్టర్ పెంటయ్య

కోదాడ రూరల్: వీధి కుక్కల దాడిలో గాయపడిన వేట కుక్కకు బుధవారం కోదాడ ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య శస్త్ర చికిత్స చేశారు. వివరాల్లోకి వెళితే.. చిలుకూరు మండలం ఆర్లెగూడెం గ్రామంలో సంచార జాతులకు చెందిన వేట కుక్కను స్థానికంగా వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. దీంతో దాని కాలికి తీవ్ర గాయమైంది. దీంతో సంచార జాతులకు చెందిన కొందరు తమ వేటకు ఆధారమైన ఆ కుక్కను బతికించుకునేందుకు కోదాడ పశు వైద్యశాలకు తీసుకురాగా డాక్టర్ పెంటయ్య శస్త్రచికిత్స చేసి కుట్లు వేశారు. చికిత్స చేసిన వారిలో వైద్య సిబ్బంది సాయికృష్ణ, రాజు, ప్రశాంత్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

నేరేడుచర్ల: ముఖ్యమంత్రి సహాయనిధి కింద నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నె గ్రామానికి చెందిన యల్లబోయిన వెంకటి, షమి, శోభకు మంజూరైన చెక్కులను బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బాధితులకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెంచికల్‌దిన్నె మాజీ ఎంపీటీసీ వీరమాచనేని కృష్ణయ్య, వల్లంశట్ల కృష్ణయ్య, ఉట్కూరి భార్గవ సైదులు, పెరుగు నాగరాజు, పెద్దపంగ ఆర్కే, పెండెం హరిబాబు, సిరికొండ రామకృష్ణ, కోడిరెక్క పవర్, నాయని సైదులు, మచ్చ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి: మండల కేంద్రానికి చెందిన టి.నర్సయ్య, చల్లా లక్ష్మి, కంటు లక్ష్మమ్మ, మర్రి నవ్యశ్రీ కుటుంబాలకు మంజూరైన రూ.1.05 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం స్థానికంగా మండల కాంగ్రెస్‌నాయకుడు భాషం వీరబాబు, మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు తవిడబోయిన నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలు పలువురు పాల్గొన్నారు.

కాల్వ గండి మరమ్మతుల్లో నిర్లక్ష్యం తగదు

- కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్


కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ కాల్వ పనులు పరిశీలిస్తున్న మల్లయ్య యాదవ్

నడిగూడెం: గండ్లు పడిన సాగర్ ఎడమ కాల్వ కట్ట మరమ్మతుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం సమీపాన సాగర్ ఎడమ కాల్వ గండి మరమ్మతులను బుధవారం ఆయన పరిశీలించారు. అధికారులను అడిగి పనుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన కాల్వకు గండ్లు పడి 18 రోజులు గడుస్తున్నా ఇంకా పనులు పూర్తిచేయకపోవడం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. కమీషన్‌ల కోసం టెండర్ల పేరుతో కాలాయాపన చేస్తూ వచ్చారన్నారు. ఎండిన పొలాలకు ఎకరానికి రూ.20 వేలు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే మరమ్మతులు పూర్తి చేసి, పొలాలకు సాగు నీరిందించాలన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, నాయకులు అనంతుల ఆంజనేయులు, గార్లపాటి శ్రీనివాసరెడ్డి, యాతాకుల వీరస్వామి, లంజపల్లి నాగేశ్వరరావు, నలమాద నారాయణరావు, బొల్లం శ్రీనివాస్, భోనగిరి ఉపేందర్, దున్నా సుధాకర్, దాసరి శ్రీను ఉన్నారు.

రైతులను ఆదుకునేందుకు మంత్రి కృషి


కాగితరామచంద్రాపురం వద్ద కాల్వ పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నడిగూడెం: ఎడమ కాల్వకు గండి పడి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్నేని వెంకటరత్నం బాబు అన్నారు. బుధవారం నడిగూడెం మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ కాల్వ కట్ట మరమ్మతులను పరిశీలించిన అనంతరం పీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో పనులు పూర్తయి, రైతులకు నీరందిస్తారన్నారు. అనంతరం విధుల్లో ఉన్న అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బూతుక్కూరి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ యాతాకుల జ్యోతి, మాజీ వైస్‌ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వేపూరి సుదీర్, ఉపాధ్యక్షుడు దున్నా శ్రీను, కోదాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంపటి రామారావు, ఆ పార్టీ సీనియర్ నాయకులు ఆవుదొడ్డి ధనమూర్తి, నాగిరెడ్డి లింగారెడ్డి, దేవబత్తిని రమేష్ ప్రసాద్, పాలడుగు ప్రసాద్, నళిణిరెడ్డి, బాణాల నాగరాజు, పాతకొట్ల నాగేశ్వరరావు, నాగేందర్, దేవమణి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి


కోదాడ రూరల్: నల్లబంగూడెంలో పోషణ అభియాన్‌లో పాల్గొన్న సీడీపీఓ తదితరులు

కోదాడ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని కోదాడ సీడీపీఓ పారిజాత అన్నారు. బుధవారం కోదాడ మండలం నల్లబండగూడెం అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు రమణ, అనంతలక్ష్మి, ఉమా, ఫరీద్, డాక్టర్ పరమేశ్వరి, మాజీ సర్పంచ్ అంగన్‌వాడీలు మమత, ఉమా సుప్రియ, ఏఎన్‌ఎంలు గోపమ్మ పాల్గొన్నారు.

మఠంపల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ అభియాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వీరజానకి, గోవిందమ్మ, దానమ్మ, రాములమ్మ, కృష్ణవేణి , రమణ, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

పాలకవీడు: పర్యావరణ రక్షణ మనందరి బాధ్యత అని ఎంపీడీఓ లక్ష్మి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె పాలకవీడు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పాలకవీడులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ లక్ష్మి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


ఆర్డీఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

కోదాడ రూరల్: వరదతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ కోదాడ అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక కార్యకలపాలకు నిరసనగా బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో బుధవారం కోదాడ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలకు పడిన గండ్లను వెంటనే పూడ్చి రైతులకు నీరందించాలన్నారు. వెంటనే రైతులకు రైతు భరోసా అందించాలన్నారు. వరదలతో ఇసుక మేటవేసిన ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ సూర్యనారాయణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిట్టయ్య, అక్కిరాజు యశ్వంత్, బొలిశెట్టి కృష్ణయ్య, వంగవీటి శ్రీనివాసరావు, వై.రామారావు, సీహెచ్.శ్రీనివాసరావు, కృష్ణప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, జనార్దన్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దెక్కన్ సిమెంట్స్ సీజీఎం నాగమల్లేశ్వరరావు

పాలకవీడు: పరిసర గ్రామాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని దెక్కన్ సిమెంట్స్ పరిశ్రమ సీజీఎం నాగమల్లేశ్వరరావు అన్నారు. పాలకవీడు మండలం చెరువుతండా గ్రామంలో మట్టి రోడ్డుతో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి సుమారు రూ.9 లక్షల వ్యయంతో పరిశ్రమ ఆధ్వర్యంలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్‌వీ.సుబ్బారావు, వెంకటినాయక్, సైదానాయక్, కృష్ణానాయక్, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

దెక్కన్ సిమెంట్స్‌లో రేపు ఉచిత వైద్య శిబిరం

పాలకవీడు మండల పరిధిలోని దెక్కన్ సిమెంట్ పరిశ్రమలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ పరిశ్రమ సీజీఎం నాగమల్లేశ్వరావు బుధవారం తెలిపారు. ప్రస్తుతం చాలా గ్రామాల్లో ప్రజలు జ్వరాల బారిన పడుతున్న నేపథ్యంలో మిర్యాలగూడేనికి చెందిన మాక్స్‌క్యూర్ హాస్పిటల్ వారిచే వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు


మాట్లాడుతున్న ఎస్‌ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్: విద్యార్థులు డ్రగ్స్ జోలికెళ్లొదని, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ ముత్తయ్య అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని వీవీఎం పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్ మత్తు మందుల నియంత్రణపై పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజలు, విద్యార్థులెవరైనా వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దని అన్నారు. సదస్సులో ఏఎస్‌ఐ రమేష్, కానిస్టేబుళ్లు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.